


వాడాడ సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

గార, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వాడాడ పంచాయతీ సర్పంచ్ సుంకాన సురేష్ చెక్‌పవర్‌ను డీపీవో రద్దు చేశారని ఎంపీడీవో ఎస్.శ్రీనివాసులు తెలిపారు. వాడాడ గ్రామంలో చెరువు వేలంపాటకు సంబంధించిన నిధులు రూ.1.30 లక్షలు పంచాయతీ ఖాతాకు జమ చేయలేదని పలువురు స్థానికులు ఇటీవల ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సంబంధిత అధికారులు విచారణ చేపట్టారు. నిధులు పంచాయతీ ఖాతాకు జమకాలేదని నిర్ధారించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. ఈ మేరకు సర్పంచ్ సురేష్ చెక్‌పవర్‌ను రద్దు చేస్తూ డీపీవో ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో తెలిపారు.

విద్యతోనే సమాజంలో మార్పు



పాఠశాలలో భోజనం చేస్తూ విద్యార్థిని పేడాడ మోక్షతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, పక్కన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విద్యార్థులతో ముచ్చట్లు

సహపంక్తి భోజన సమయంలో మంత్రి అచ్చెన్న పేడాడ మోక్ష అనే విద్యార్థినితో కాసేపు ముచ్చటించారు. ఎన్నో తరగతి చదువుతున్నావని, ఎక్కడి నుంచి వస్తున్నావని, తల్లిదండ్రులు ఏమి చేస్తుంటారని మంత్రి కుశలు ప్రశ్నలు వేశారు. తాను ఆరో తరగతి చదువుతున్నానని, సంతబొమ్మాళి మండలం ఇజ్జువరం నుంచి వస్తున్నానని, తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేస్తుంటారని బాలిక మోక్ష తెలిపింది. బాగా చదువుకుని.. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని మంత్రి అచ్చెన్న సూచించారు.

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- ఘనంగా మెగా పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్
- టెక్కలిలో విద్యార్థులతో కలిసి మంత్రి, కలెక్టర్ సహపంక్తి భోజనం

టెక్కలి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): 'విద్య ద్వారా సమాజంలో మార్పు వస్తుంది. జిల్లా నుంచి వలసల నివారణలో భాగంగా అక్షరాస్యత శాతం పెంచే దిశగా చర్యలు చేపడుతున్నామ'ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. టెక్కలిలోని జిల్లాపరిషత్ బాలికల హైస్కూల్ ప్లస్‌లో శుక్రవారం మెగా పేరెంట్స్ - టీచర్స్ సమావేశం (పీటీఎం) పండుగ వాతావరణంలో జరిగింది. మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా విద్యాశాఖాధికారి ఎ.రవిబాబు తదితరులు విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి సుమారు మూడు గంటలు గడిపారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ 'ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. విద్యార్థులు ఉన్నతి కోసమే ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్- టీచర్స్ సమావేశం ఏర్పాటు చేసింది. టీడీపీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుంది. నాడు ఎన్టీ రామారావు రెసిడెన్షియల్ స్కూల్ వ్యవస్థను తీసుకువచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతి గ్రామానికి ఒక పాఠశాల, మూడు కిలోమీటర్లకు ఒక యూపీ స్కూల్, ఐదు కిలోమీటర్లకు ఒక హైస్కూల్, రెవెన్యూ డివిజన్‌కు ఇంజనీరింగ్ కళాశాల, జిల్లా కేంద్రానికి వైద్య కళాశాల ఏర్పాటు చేయించారు. యువ నాయకుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత డీఎస్సీ నియామకం చేపట్టారు. వేలాది ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారు. డీఎస్సీ అంటే టీడీపీ.. టీడీపీ అంటే డీఎస్సీ అని రుజువు చేశారని తెలిపారు. విద్యను రాజకీయాలతో ముడిపెట్టకూడదన్నారు. గతంలో జగన్‌రెడ్డి ఏ పథకం ప్రవేశ పెట్టినా ఒకటే పేరుతో పిలవబడేదని ఎద్దేవా చేశారు. 'టెక్కలిలో ఈ పాఠశాలను రాష్ట్రంలో ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి. పాఠశాలకు అవసరమయ్యే మరుగుదొడ్లు, మైదానం, (మిగతా 6వ పేజీలో..)

టెక్కలిలోని జిల్లాపరిషత్ బాలికల హైస్కూల్ ప్లస్‌లో మరో బాలిక కల్నిక పరీక్‌తో కూడా మంత్రి అచ్చెన్న, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడారు. బాలిక వివరాలు ఆరా తీశారు. 'నేను పదో తరగతి చదువుతున్నాను. మాది రాజస్థాన్. మా తల్లిదండ్రులు ఇక్కడకు వచ్చి స్థిరపడ్డారు. నాన్న ఓ మిఠాయి దుకాణంలో పనిచేస్తున్నారు' అని బాలిక కల్నిక పరీక్ తెలిపింది. రాజస్థాన్ నుంచి వచ్చి ఇక్కడ చదువుతున్నావు. నీకు ఇక్కడ చదువు అర్థమవుతుందా? అని కలెక్టర్ అడగ్గా.. తెలుగు చక్కగా అర్థమవుతోందని బాలిక వివరించింది. బాగా చదువుకో.. మంచిపేరు తెచ్చుకో అని కలెక్టర్ సూచించగా.. 'ధన్యవాద్ జీ' అని బాలిక తెలిపింది.

రక్తమోడుతున్న రహదారులు



- జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- మితిమీరిన వేగం, నిర్లక్ష్యమే కారణం
- మృతుల కుటుంబాల్లో తీరని విషాదం

● గత నెల 27న పలాస మండలం పాత జాతీ యరహదారి గరుడఖండి గ్రామం సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో పాతపట్నం మండలం సరాళి గ్రామానికి చెందిన తలగాపు భీమారావు(25), ఒడిశా రాష్ట్రం ఆర్.ఉదయగిరి సమితి డెరబా గ్రామానికి చెందిన సుశాంత్‌జెన్నా(26) అక్కడి కక్కడే మృతి చెందారు. హెల్మెట్ ధరించకుండా, మితిమీరిన వేగంతో ప్రయాణించడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు గుర్తించారు.

● గత నెల 10న నరసన్నపేట జాతీయరహదారి కోమర్తి జంక్షన్ వద్ద కారు రిపేరు చేస్తుండగా వెనుకనుంచి మరో కారు వచ్చి ఢీకొనడంతో మెకానిక్ అక్కడి కక్కడే మృతి చెందాడు. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు తేల్చారు.

● ఈ ఏడాది మే నెలలో పాతపట్నం-పర్లాకిమిడి హైవే రోడ్డులో రోడ్డుపక్కన ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మితిమీరిన వేగం, నిర్లక్ష్యం కారణంగా మూడు నిండుప్రాణాలు గాలిలో కలసిపోయాయి.

● 2021లో పలాస జాతీయ రహదారి రంగోయి వద్ద నలుగురు ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. వారు బొలేరా వాహనంలో మితిమీరిన వేగంతో వచ్చి డివైడర్‌ను ఢీకొని.. పక్కరోడ్డుపైకి దూసుకెళ్లి లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. నలుగురి కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది.

పలాస/ ఇచ్ఛాపురం/ నరసన్నపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. కొంతమంది వాహనదారులు మితిమీరిన వేగం, నిర్లక్ష్యం, మద్యం సేవించి వాహనాలు నడపడం తదితరవి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఫలితంగా కొందరు ప్రాణాలు కోల్పోతుండగా.. మరికొందరు తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలవుతున్నారు. ప్రమాద ఘటనలు మృతుల కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతున్నాయి. తరచూ కొన్ని ప్రాంతాల్లోనే ప్రమాదాలు జరుగుతుండగా.. వాటి నివారణలో పోలీసు శాఖ విఫలమవుతుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో రణస్థలం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం జాతీయ రహదారులపై, ఫ్లైఓవర్ల కూడళ్ల వద్ద తరచూ ప్రమాదాలు జరిగి మరణాలు సంభవిస్తున్నాయి. కోమర్తి, టెక్కలి, ఐతమ్ కళాశాల రోడ్డు, తామరాపల్లి, కొత్తగ్రహారం, కేదారిపురం, శాసనం, కోసంగిపురం, రామకృష్ణాపురం, సొండిడికొట్టు జంక్షన్, రంగోయి జంక్షన్, మందస సర్వీసు రోడ్డు, కంచిలి-మఖరాంపురం జంక్షన్, ఇచ్ఛాపురం టోల్‌ప్లాజా వద్ద ఎప్పటికప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రుల ప్రయాణాలు కూడా రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. గతంలో హైవేతోపాటు ముఖ్యకూడళ్లు, టోల్‌ప్లాజాలు వద్ద పోలీసులు అర్ధరాత్రి దాటిన తరువాత వాహన డ్రైవర్లను అప్రమత్తం చేసేవారు. రాత్రి 2 నుంచి 4 గంటల వరకు సమీపంలో రెస్ట్ పాయింట్ల వద్ద వాహనాలను నిలిపివేయించి.. డ్రైవర్లు విశ్రాంతి తీసుకునేలా చర్యలు చేపట్టేవారు. ప్రస్తుతం ఆ దిశగా చర్యలు లేకపోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

కారు నడిపే (మిగతా 6వ పేజీలో..)

నిబంధనలు పాటించాలి



నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే ఎటువంటి ప్రమాదాలు జరగవు. హెల్మెట్, సీటుబెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలి. రహదారులపైకి వెళ్లేటప్పుడు వేగాన్ని అదుపులోకి పెట్టుకోవాలి. ఎదురుగా వెళ్తున్న వాహనాల స్పీడు గుర్తించి.. నియంత్రిస్తే మంచిది.

-బి.గోపాల్, స్వచ్ఛంద సేవకుడు, కాశీబుగ్గ

అవగాహన కల్పిస్తున్నాం



రోడ్డు ప్రమాదాల నియంత్రణపై యువతకు అవగాహన కల్పిస్తున్నాం. జాతీయరహదారులపై సిబ్బందిని పెట్టి వాహనాల వేగాన్ని నియంత్రిస్తున్నాం. హెల్మెట్, సీటుబెల్టు లేని వాహనాలు గుర్తించి అపరాధ రుసం వసూలు చేస్తున్నాం. రాత్రులు ఇచ్ఛాపురం, లక్ష్మీపురం, మడపాం టోల్‌ప్లాజాల వద్ద డ్రైవర్లకు నీటిని స్ప్రే చేసి వారికి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నాం.

-లక్ష్మణరావు, డీఎస్పీ, కాశీబుగ్గ

పశుసంవర్ధక శాఖలో పదోన్నతి

- డిప్యూటీ డైరెక్టర్‌గా రవికృష్ణ

శ్రీకాకుళం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పలాసలోని పశుసంవర్ధకశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా పనిచేస్తున్న డాక్టర్ ఎం.రవికృష్ణకు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వులను జారీచేశారు. ప్రస్తుతం పలాసలో ఏడీగా ఉన్న డాక్టర్ రవికృష్ణను శ్రీకాకుళంలోని 'ఆత్మ'(ఏటీఎంఏ) కార్యాలయంలో డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్(డీపీడీ)గా నియమించారు. సొంత జిల్లాలో పోస్టింగ్ ఇవ్వకూడదనే నిబంధనను సడలించి మరీ ఆయనకు శ్రీకాకుళంలోనే పోస్టింగ్ ఇవ్వడం విశేషం. ఈ పదోన్నతితో ఆయన రూ.76,730 నుంచి రూ.1,62,780 వేతన శ్రేణిలోకి వెళ్తారు. తాత్కాలిక (అడహాక్) ప్రాతిపదికన ఈ పదోన్నతి ఉంటుందని.. ఉత్తర్వులు అందిన 15 రోజుల్లోగా ఆయన కొత్త విధుల్లో చేరాలని ప్రభుత్వం ఆదేశించింది.



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వరరావు

ఎయిర్‌పోర్టు నిర్వాసితులకు రెండున్నర రెట్లు పరిహారం

- ఏ ఒక్కగ్రామం తొలగించకుండా నిర్మాణం చేపడతాం
- అభివృద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తాం
- ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వరరావు

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): 'ఉద్దానం తీరప్రాంతంలో అత్యాధునిక హంగులతో ప్రభుత్వం ఎయిర్‌పోర్టు నిర్మించనుంది. నిర్వాసిత రైతులకు రెండున్నర రెట్లు పరిహారం అందజేయనుంద'ని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం వజ్రపుకొత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో పలాస ఆర్డీవో వెంకటేష్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 'ఎయిర్‌పోర్టు నిర్మాణంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా పదివేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. సాంకేతికంగా అనుకూలంగా ఉండడం వల్ల మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో ప్రాంతాన్ని ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఎంపిక చేశాం. 1200 ఎకరాల వరకు స్థల సేకరణకు నిర్ణయించాం. అందులో ప్రభుత్వ భూమి 200 ఎకరాల వరకు ఉంది. వజ్రపుకొత్తూరు మండలం మోట్టూరు పంచాయతీలో 150 ఎకరాలు, చీపురుపల్లి పంచాయతీలో 317 ఎకరాలు రైతుల నుంచి సేకరించనున్నాం. ప్రభుత్వ భూమి అధీనంలో ఉన్న రైతులకు జిరాయితీ (మిగతా 6వ పేజీలో..)

10 నుంచి టెట్

- జిల్లాలో మూడు కేంద్రాల్లో నిర్వహణకు ఏర్పాట్లు
- పరీక్షకు 12,185 మంది అభ్యర్థుల దరఖాస్తులు
- స్కోర్ కోసం సర్వీసు ఉపాధ్యాయులు కూడా..

నరసన్నపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఈ నెల 10 నుంచి 21 వరకు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలో 12,185 మంది అభ్యర్థులు టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్ విధానంలో పరీక్షల నిర్వహణ కోసం విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీ, ఎచ్చెర్లలోని శ్రీ శివానీ, శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలను పరీక్ష కేంద్రాలుగా కేటాయించారు. వీటి పర్యవేక్షణ బాధ్యతను నరసన్నపేట, ఎచ్చెర్ల, లావేరు విద్యాశాఖ అధికారులకు అప్పగించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇన్ సర్వీసు ఉపాధ్యాయులు కూడా టెట్‌కు తప్పనిసరిగా మూడేళ్లలో ఉత్తీర్ణత సాధించాల్సిందేనని ప్రభుత్వం మార్గదర్శికాలు జారీ చేసింది. 2009 డీఎస్సీకి ముందు ఉపాధ్యాయులుగా విధుల్లో చేరినవారు సుమారు 9వేలమందికిపైగా ఉన్నారు. వీరిలో కేవలం 10శాతం మంది టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి కొంతమంది సర్వీసు ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. ఇతర రాష్ట్రాల్లో ఇంకొంతమంది న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించారు. కేంద్ర ప్రభుత్వం, న్యాయస్థానం అనుకూలంగా స్పందిస్తుందనే ఆశతో ఉన్నారు. ఇటీవల మెగా డీఎస్సీలో టెట్‌లో తక్కువ మార్కులు వచ్చి ఎందరో అభ్యర్థులు ఉపాధ్యాయ పోస్టులకు దూరమయ్యారు. అటువంటివారితో పాటు ఇటీవల రిలీవైన బీఈడీ, డైట్ విద్యార్థులు కూడా టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు.



నరసన్నపేటలో టెట్ పరీక్ష కేంద్రం ఇదే

శతశాతం ఫలితాలకు సంకల్ప దీక్ష
- ఇంటర్‌లో ఉత్తీర్ణత పెంపుపై దృష్టి
- కళాశాలల్లో ప్రత్యేక స్టడీఅవర్స్
- పోటీ పరీక్షలకూ శిక్షణ

6లో

అరసవల్లి రథసప్తమికి పటిష్ఠ ఏర్పాట్లు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


7లో

ప్రయాణికులుగా ఆటో ఎక్కి..
- బ్యాగును కోసి రూ.3 లక్షలు చోరీ
- పోలీసులకు ఫిర్యాదు చేసిన వృద్ధుడు

8లో

డిమాండ్ ఉన్నా.. గిట్టుబాటు కాలే!

- కొబ్బరి రైతులకు ఆశించిన స్థాయిలో దక్కని ధర
- వ్యాపారుల మాయాజాలంపై విమర్శలు
- పంటకు తెగుళ్ల బెడదతో అవస్థలు



సోంపేట రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కష్టపడి పండించిన పంట అమ్ముకోవాలనే ఆరాటం కొబ్బరి రైతులది. అందిన అవకాశాన్ని సొమ్ముగా మార్చుకోవాలనే ఆశ వ్యాపారులది. ప్రస్తుతం కంచిలి, మందస మార్కెట్‌లో ఒక్కో కొబ్బరికాయ రూ.30 నుంచి రూ.50 చొప్పున పలుకుతోంది. కానీ ఉద్దానంలో పండించిన రైతులకు వ్యాపారుల నుంచి రూ.15 నుంచి రూ.22 చొప్పున మాత్రమే దక్కుతోంది. వ్యాపారులు తమ కష్టాన్ని దోచుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్దానం ప్రాంత రైతులకు కొబ్బరి పంటే ప్రధాన జీవనాధారం. సోంపేట, మందస, కవిటి, కంచిలి, పలాస, వజ్రపుకొత్తూరు, ఇచ్ఛాపురం తదితర మండలాల్లో జీడితో సమానంగా కొబ్బరి పంటను వేలాది హెక్టార్లలో సాగు చేస్తున్నారు. సోంపేట మండలం సిరిమామిడి, మామిడిపల్లి, తురకశాసనం, గొల్లవూరు, ఉప్పలాం తదితర పంచాయతీలతో పాటు మందస మండలం గెడ్డవూరు, దున్నవూరు, బేతాళపురం, గంగువాడ తదితర గ్రామాల్లో కొబ్బరిపై అనేక కుటుంబాలు ఆధారపడి బతుకుతున్నాయి. కాగా ఏటా తుఫాన్‌లు, మరోవైపు తెగుళ్ల కారణంగా కొబ్బరి పంట దిగుబడి క్రమేపీ తగ్గుతోంది. 2018లో తితలీ తుఫాన్‌కు ముందు ఎకరా కొబ్బరితోటలో వెయ్యి కాయలు వరకూ దిగుబడి వచ్చేవి. కానీ తితలీ తుఫాన్ ప్రభావంతో వేలాది ఎకరాల్లో కొబ్బరి చెట్లు నేలమట్టం అయ్యాయి. మిగిలిన చెట్లకు తెల్లదోమ సోకడంతో పచ్చదనం హరించుకుపోయింది. క్రమేపీ కొబ్బరికాయల దిగుబడి తగ్గిపోయింది. కొబ్బరికాయలకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్నా.. తమకు మాత్రం ఆశించిన స్థాయిలో ధర దక్కడం లేదని రైతులు వాపోతున్నారు. స్థానిక వ్యాపారుల వద్ద తోటలపై ముందుగానే అప్పు చేయడం వల్ల వారు కొబ్బరికాయకు ఎంత ధర కడితే అంతకు విక్రయించాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. వ్యాపారులు ఊరికో రేటు చొప్పున కొబ్బరికాయలు కొనుగోలు చేసి.. తమను దోచుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. తమ అవస్థలను ఉద్యానశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి కొబ్బరితోటలకు అవసరమైన క్రిమిసంహారక మందులను అందజేయాలని కోరుతున్నారు. వ్యాపారుల దోపిడీని అరికట్టి.. తమకు కనీస గిట్టుబాటు ధర కల్పించేలా (మిగతా 6వ పేజీలో..)

స్క్రబ్‌టైఫస్‌పై జాగ్రత్త

- ఐదు రోజులు జ్వరం తగ్గనివారికి పరీక్ష తప్పనిసరి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పాత శ్రీకాకుళం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్క్రబ్ టైఫస్ వ్యాధి నియంత్రణ కోసం ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్త పాటించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వైద్యఆరోగ్యశాఖాధికారులు, ప్రైవేటు ల్యాబ్‌టెక్నీషియన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'చిగ్గర్ అనే కీటకం ద్వారా స్క్రబ్‌టైఫస్ వ్యాధి మనుషులకు సోకుతుంది. ఐదు రోజులు జ్వరం తగ్గని వారు తప్పనిసరిగా పరీక్ష చేసుకోవాలి. ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదు. వ్యాధి నిర్ధారణ కిట్లు అందుబాటులోకి తెస్తున్నాం. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందుబాటులో ఉంద'ని తెలిపారు. నిబంధనల మేరకు ప్రైవేటు ల్యాబ్‌ల్లో నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అనిత మాట్లాడుతూ.. 'స్క్రబ్‌టైఫస్ వ్యాధి పొదలు, గడ్డి పొలాలు, అడవి ప్రాంతాల్లో ఉండే చిగ్గర్లు కుట్టడం వల్ల వస్తుంది. అధిక జ్వరం, తీవ్ర తలనొప్పి, శరీర బలహీనత, వాంతులు ఈ వ్యాధి లక్షణాలు. కీటకం కుట్టిన చోట నల్లటి మచ్చ ఏర్పడుతుంది. వ్యవసాయం చేసేవారు, పశువుల పాకల్లో తిరిగే వారికి ఈ వైరస్ సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ప్రజలు జాగ్రత్తగా ఉండాల'ని తెలిపారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ కళ్యాణ్‌బాబు, జీజీహెచ్ పలు విభాగాధిపతులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఆత్మీయ సమావేశాలు

● జిల్లా వ్యాప్తంగా మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లు

జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ శుక్రవారం మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లు నిర్వహించారు. తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లల ప్రతిభను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు కూడా హాజరయ్యారు. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను తల్లిదండ్రులకు వివరించారు. విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలిపారు.

ఆధునిక సాంకేతికతతో పాఠశాలల అభివృద్ధి: ఎమ్మెల్యే శంకర్



క్రీడాకారులు సాధించిన పతకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

పాత శ్రీకాకుళం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతికతతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఏవీఎన్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 3.0 నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని గాంధీజీ, సరస్వతీ దేవి విగ్రహాలకు పూలమాల వేశారు. అనంతరం మాట్లాడుతూ.. తాను కూడా పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని, ఆరోజుల్లో సైకిల్‌పై రెండు కిలోమీటర్లు పాఠశాలకు వెళ్లేవాడినన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులే తొలి గురువులని, పిల్లల్లోని ప్రతిభను గుర్తించి ఉన్నత లక్ష్యాల వైపు తీర్చిదిద్దేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం వివిధ స్టాల్స్‌ను పరిశీలించారు. ఉపాధ్యాయులు, కూటమి నేతలు, మునిసిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకే: ఎమ్మెల్యే రవికుమార్



బూర్జ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

బూర్జ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యారంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం మెగా పేరెంట్స్‌టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తోందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. కొల్లి వలస కేజీబీవీ పాఠశాలలో పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశలో క్రమశిక్షణతో విద్యను అభ్య సించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థులు తయారుచేసిన పలు ప్రాజెక్టులను పరిశీలించారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వ ప్రసాద్, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కన్నంనాయుడు, స్కూల్ ఎస్ఎంసీ వాసు, ఆనందరావు, సీతబాబు, ప్రభాకరరావు, ప్రిన్సిపాల్ గాయత్రి, ఎంఈవోలు శ్యాంసుందర రావు, ధనుంజయరావు, ఎంపీడీవో తిరుపతిరావు, పద్మావతి, ఐసీడీఎస్ పీవో గీత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ బలోపేతమే లక్ష్యం: ఎమ్మెల్యే అశోక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

ఇచ్ఛాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. శుక్రవారం ధర్మపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో గడిచిన 18 నెలల్లో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసే దిశలో చర్యలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహ కాలను వినియోగించుకుని బాధ్యతాయుతంగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఇచ్ఛాపురానికి చెందిన బంగారు వ్యాపారి పైడిశెట్టి దినేష్‌కుమార్ తన తండ్రి రవికుమార్ జ్ఞాపకార్థం ధర్మపురం పాఠశాలలో ఆర్వోప్లాంట్, పురుషోత్తపురం ఏపీ మోడల్ పాఠశాలలో వాటర్ పైప్‌లైన్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయగా వాటిని ఎమ్మెల్యే అశోక్ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.వెంకటరావు, ఎంపీడీవో ప్రభాకరరావు, ఎంఈవోలు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథం, ప్రిన్సిపాల్ డి.వైకుంఠరావు, జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, రెడ్డిక కార్పొరేషన్ ఛైర్మన్ కొండా శంకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరం..



హిరమండలం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

హిరమండలం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం దోహదపడుతుందనే సదాశయంతో ప్రభుత్వ మెగా పేరెంట్స్ టీచర్స్-3.0 సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. శుక్రవారం హిరమండలం కేజీబీవీలో ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన పీటీఎంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యతోపాటు విద్యార్థుల్లో వివిధ నైపుణ్యాలను అభివృద్ధి చేసే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆటల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాశీప్రసాద్, ఎంఈవో రాంబాబు, జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, మండల ప్రత్యేకాహ్వానితులు ఎం.తిరుపతిరావు, టీడీపీ మండల అధ్యక్షుడు దారపు డిల్లేశ్వరావు, సర్పంచ్ ఎల్.రోజారాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక కేజీబీవీలో నిర్మించిన అదనపు భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు.

విద్యతోనే సమాజాభివృద్ధి: ఎమ్మెల్యే శిరీష



పలాస రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బ్రాహ్మణతర్లా జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రులతో ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల అభ్యసన, విద్యను నేర్చుకుంటున్న విధానం తల్లిదండ్రులు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. విద్యార్థులతో ముఖాముఖీ మాట్లాడి పాఠశాల విద్యకు ప్రభుత్వం అందిస్తున్న కార్యక్రమాలను తెలియజేశారు. తొలుత విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వాటిని సంరక్షించారు. తహసీల్దార్ కల్యాణ్ చక్రవర్తి, ఎంపీడీవో వసంతకుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణ్‌కుమార్, పీఏసీఎస్ ఛైర్మన్ వంకల కూర్మారావు, ఏఎంసీ ఛైర్మన్ మల్లా శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ దువ్వాడ కృష్ణమూర్తినాయుడు, హెచ్ఎం పండా, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు తమ్మినేని గంగారామ్, వడ్డీ యాదగిరి, సుదర్శనరావు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి: ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం/ఎచ్చెర్ల/రణస్థలం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఈ దిశలో విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వర రావు అన్నారు. సంతవురిటి, కొయ్యాం, పాతర్లపల్లి గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తల్లిదండ్రుల కలలు నిజం చేసేలా చదువుకోవాలన్నారు. విద్యార్థి దశలోనే ప్రణాళికా బద్ధంగా చదువుకుని భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలన్నారు. విద్యార్థులు తయారుచేసిన పలు ప్రదర్శనలను తిలకిం చారు. కార్యక్రమాల్లో డీసీఎంఎస్ ఛైర్మన్ చౌదరి అవినాష్, టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము, తహసీల్దార్లు ఎం.సరిత, బి.గోపాల్, ఎంపీడీవోలు జి.రామకృష్ణరావు, ఎస్.హరిహరరావు ఎంఈవోలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు, కె.పున్నయ్య, హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.



రణస్థలం: పాతర్లపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

విద్యను మెరుగుపరచడమే లక్ష్యం: ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



హిందీ యోగ్యత పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పోలాకి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యను అన్నివిధాల మెరుగుపరచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం మబగాం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పీటీఎం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డీఎస్సీల ద్వారా ఉపాధ్యాయుల ఖాళీలతో పాటు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్ నియామకాలు చేపట్టిందన్నారు. పాఠశాలలో హిందీప్రచార సభ ద్వారా నిర్వహించిన నాగరీబోధ్, ప్రవేశ, హిందీ యెగ్యతా పత్రాలను హిందీ పండితురాలు వసంత ఆధ్వర్యంలో విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతర విద్యార్థుల విద్యాప్రగతి తదితర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాధాకృష్ణ, కూటమి నాయకులు ఎంపీ నాయుడు, బైరి భాస్కరరావు, రోణంకి కృష్ణంనాయుడు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. జిల్లేడుమాకివలస పాఠశాల నిర్వహించిన పీటీఎం కార్యక్రమంలో ఐదో తరగతి చదువుతున్న సంధ్య నృత్య ప్రదర్శనతో ఆకట్టుకుంది.

డిమాండ్ ఉన్నా.. గిట్టుబాటు కాలే!

(ఐదో పేజీ తరువాయి)

చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. బారువలో కొబ్బరి నారుమడి క్షేత్రం అభివృద్ధి చర్యలు తీసుకుంటే కొంతమేర సాంత్వన చేకూరుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

దిగుబడి తగ్గింది..

కొబ్బరికి తెల్లదోమ, నల్లమట్ట తెగుళ్ల వల్ల దిగుబడి బాగా తగ్గింది. గతంలో ఒక్కో గెలకు సుమారు 30 కాయలు ఉండేవి. ప్రస్తుతం ఆరు, ఏడు మాత్రమే దిగుబడి వస్తున్నాయి. మార్కెట్‌లో వ్యాపారులు ఒక్కో కొబ్బరికాయ రూ.30కిపైగా విక్రయిస్తున్నారు. కానీ మాకు మాత్రం రూ.15 నుంచి రూ.18లోపు చెల్లిస్తున్నారు.

-గొరకల లింగరాజు, కొబ్బరి రైతు, మామిడిపల్లి

దోచుకుంటున్నారు..

ఉద్దానం ప్రాంతంలో వ్యాపారులంతా ఒక్కటై కొబ్బరి రైతులను దోచుకుంటున్నారు. కొబ్బరికాయలకు డిమాండ్ ఉన్నా.. పండించిన రైతులకు మాత్రం ఫలితం లేకపోతోంది. ప్రభుత్వం స్పందించి కొబ్బరి బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

-తిమ్మల వీరస్వామి, కొబ్బరిరైతు, పాతినివలస

ఊపందుకున్న వరికోతలు

పలాస, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పలాస నియోజకవర్గంలో వరికోతలు ఊపందుకున్నాయి. దిత్వా తుఫాన్‌తో ఈ ప్రాంతంలో చిన్నచిన్న చినుకులు తప్పా పెద్దగా ప్రభావం చూపలేదు. దీంతో ముమ్మరంగా కోతలు జరుగుతున్నాయి. అయితే చిన్నచిన్న చినుకులు పడి తెరిపి ఇవ్వడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఇక వర్షాలు లేవని నిర్ధారించుకున్న రైతులు కోతలకు సిద్ధపడ్డారు. ఇప్పటికే 40శాతానికి పైగా కోతలైనట్టు ఏవో పోలారావు తెలిపారు. కోతల అనంతరం పెనలు, మినుములు జల్లుకుంటున్నారు.



పొలాల్లో కోసిన వరిపైరును నూర్పులకు తరలిస్తున్న రైతులు

ఎయిర్‌పోర్టు నిర్వాసితులకు రెండున్నర రెట్లు పరిహారం

(ఐదో పేజీ తరువాయి)

రైతులతో సమానంగా పరిహారం అందిస్తాం. ఏ ఒక్క గ్రామాన్నీ తొలగించం. భూములు కోల్పోయిన రైతులకు మార్కెట్ ధరకన్నా రెండున్నర రెట్లు పరిహారం అందిస్తాం. తోటల్లో ఉన్న చెట్లకు, పశువుల శాలలకు రెట్టింపు పరిహారం ఇస్తాం. త్వరలో గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహిస్తాం. ఇంకా ఏమైనా డిమాండ్‌లు ఉంటే.. వాటిని రైతులు అధికారుల ముందు వెల్లడించాలి. ఎయిర్ పోర్టు నిర్మాణంతో ఉద్దాన ప్రాంతంలో అభివృద్ధి చెందుతున్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలి. ఎయిర్‌పోర్టు కారణంగా ఈ ప్రాంతంలో మరిన్ని ప్రాజె క్టులు ఏర్పడి ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఇందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. తహసీల్దార్ బీవీ సీతారామ్మూర్తి పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో మార్పు

(ఐదో పేజీ తరువాయి)

అదనపు తరగతి గదులు, వంట కార్మికులకు షెడ్లు, నీడలో కూర్చొని తినే సౌకర్యం కల్పిద్దామని మంత్రి అచ్చెన్న తెలిపారు. అంతకుముందు విద్యార్థులు రూపొందించిన పలు వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉన్నతాధికారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ బగాది శేషగిరి, ఏపీసీ పప్పల వేణుగోపాలరావు, ఉపవిద్యాశాఖాధికారి విలియమ్స్, ఎంఈవోలు తులసీరావు, చిన్నారావు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఈశ్వరమ్మ, హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, సుందరమ్మ, లవ, కామేసు, ప్రసాద్‌రెడ్డి, మెండ దమయంతి, ఉపాధ్యాయులు వాణిశ్రీ ఉన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

రక్తమోడుతున్న రహదారులు

(ఐదో పేజీ తరువాయి)

వాహనదారులు తప్పనిసరిగా సీటుబెల్టు పెట్టుకోవాలి. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి. మద్యం సేవించి వాహనాలు నడపకూడదు, అతివేగంగా ప్రయాణించడం నేరం. ట్రాఫిక్ నిబంధనల ప్రకారం రోడ్డు ఎక్కినప్పుడు రోడ్డుపక్కన ఉండే వేగనియంత్రణను గమణించి ప్రయాణించాలి. ముఖ్యకూడళ్ల వద్ద వాహనాలు వేగాన్ని నియంత్రించి నెమ్మదిగా వెళ్లాలి. ప్రస్తుతం శీతాకాలం కావడంతో వేకువజామున ప్రయాణం ప్రమాదకరం. రోడ్డుపై పొగమంచు కురిసే అవకాశం ఉన్నందున వాహనాలు నియంత్రణలో నడపాలి.

శతశాతం ఫలితాలకు సంకల్ప దీక్ష

● ఇంటర్‌లో ఉత్తీర్ణత పెంపుపై దృష్టి
● జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక స్టడీ అవర్స్
● పోటీ పరీక్షలకు అనుగుణంగా శిక్షణ



నరసన్నపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా సంబంధిత అధికారులు అడుగులు వేస్తున్నారు. మెరుగైన ఫలితాల కోసం కార్యాచరణ సిద్ధం చేశారు. ఇంటర్ బోర్డు సూచనలకు అనుగుణంగా 'సంకల్ప' దీక్ష పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా 50 రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

ఆ విద్యార్థుల కోసం..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇటీవల నిర్వహించిన అర్ధ సంవత్సర పరీక్షలలో వచ్చిన మార్కుల ఆధారంగా వివిధ సబ్జెక్టులలో వెనుబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. దీనికోసం ఇంటర్ బోర్డు 'సంకల్పం-26'పేరుతో ముందడుగు వేస్తోంది. ఇందులో భాగంగా ఉదయం 8.30నుంచి10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఎంసెట్, ఐఐటీ, నీట్ వంటి పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఈ ఏడాది ఇంటర్ బోర్డు ప్రథమ సంవత్సరం విద్యార్థులను పోటీ పరీక్షలకు సమాయత్తం చేసేందుకు పబ్లిక్ పరీక్షల్లో ఖాళీలను పూరించడం, ఒక మార్కు ప్రశ్నలకు ప్రాధాన్యం ఇచ్చింది. ఈ ప్రశ్నలు శతశాతం విద్యార్థులు రాసేవిధంగా పరీక్షలు నిర్వహిస్తున్నారు.

గ్రేడుల ఆధారంగా..

ప్రశ్నపత్రాల్లో విద్యార్థులు సాధించిన మార్కులను ఎప్పటికప్పుడు బోర్డుకు పంపుతున్నారు. ఏ, బీ గ్రేడుల్లో ఉన్న వారు బాగా చదువుతున్నట్లు.. సీ, డీ గ్రేడ్ విద్యార్థులు ఇంకా మెరుగుపడాల్సి ఉందని గుర్తిస్తున్నారు. వీరికి ప్రత్యేక శిక్షణతో పాటు కొంతమంది అధ్యాపకులు దత్తత తీసుకుని స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 21నుంచి ఎన్విరాన్‌మెంట్ పరీక్షలు ప్రారంభమవుతాయి. జనవరి 27 నుంచి ఫిబ్రవరి పదో తేదీ వరకు వృత్తివిద్యా కోర్సులు అభ్యసించే వారికి ప్రాక్టికల్స్, రెగ్యులర్ విద్యార్థులకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 నుంచి పదో తేదీ వరకు ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. అనంతరం ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ ఏడాది ప్రథమ సంవత్సరం విద్యార్థులకు నూతన విధానంలో ప్రశ్నపత్రాలు రూపొందించి.. పరీక్షలను నిర్వహించనున్నారు. రెండో ఏడాది విద్యార్థులకు పాతవిధానంలోనే ప్రశ్నపత్రాలు ఉంటాయి.

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ..

జిల్లాలో 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో 12,816 మంది చదువుతున్నారు. నవంబరు 24 నుంచి 'సంకల్ప' పేరుతో ప్రత్యేకంగా స్టడీ అవర్స్‌ను నిర్వహిస్తున్నాం. ఫిబ్రవరి 20 వరకు ఇవి కొనసాగుతాయి. రోజువారీ పరీక్షలు నిర్వహించి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ఏ, బీ గ్రేడ్‌లలో ఉన్న విద్యార్థులను పోటీ పరీక్షలకు కూడా సిద్ధం చేస్తారు.

-సురేష్ కుమార్, ఆర్ఐవో

ఎన్జీవో అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక



ఎన్జీవోస్ ఆమదాలవలస యూనిట్ కార్యవర్గ సభ్యులతో జిల్లా సంఘ ప్రతినిధులు

ఆమదాలవలస, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఆమదాలవలస యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా జేఏసీ చైర్మన్, ఎన్జీవో సంఘం అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, జిల్లా జేఏసీ కన్వీనర్, జనరల్ సెక్రటరీ సల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా నక్క రమణమూర్తి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కె.మనోహర్, ఉపాధ్యక్షులుగా పీఎం గోవింద్, జి.రాము, పి. సంతోష్ కుమార్, మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎ.రాజకుమారితో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నుకున్నారు. అనంతరం పదవీ ప్రమాణం చేశారు. కార్యక్రమంలో బి.పూర్ణచంద్రరావు, ఆర్.గోవింద పట్నాయక్, బొడ్డేపల్లి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లవుతున్నా పాత రాతలేనా?

● దేవాంగుల కాలనీ పాఠశాలలో దర్శనమిచ్చిన ప్రచారం



దేవాంగుల వీధి పాఠశాలలో గోడకు రాసిన వైసీపీ ప్రభుత్వ పథకాలు

పొందూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చి సుమారు రెండేళ్లవుతున్నా వైసీపీ ప్రభుత్వంలో రాసిన రాతలే నేటికీ దర్శనమిస్తుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని దేవాంగుల కాలనీ పాఠశాలలో పేరెంట్స్-టీచర్స్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. దీనికి సంబంధించిన ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన గోడకు వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన పలు పథకాల రాతలు కనిపించాయి. దీంతో మీటింగ్‌కు వచ్చిన వారు అవాక్కయ్యారు. సిబ్బంది నిర్లక్ష్యంపై విమర్శలు వినిపించాయి.

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం

శ్రీకాకుళం అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతర పోరాటం చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్‌రావు అన్నారు. నగరంలోని యూటీ ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ 44వ జిల్లా మహాసభలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. ఎన్ఈపీ రద్దు కోసం పోరాటం చేస్తామన్నారు. మూసివేసిన పాఠశాలలను తెరిపించాలని, హాస్టళ్ల కు సొంత భవనాలు నిర్మించాలని, విద్యార్థి సంఘాలపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలన్నారు. ప్రతీ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు నిర్మించాలని, పొందూరు, పలాస డిగ్రీ కాలేజ్‌లకు సొంత భవనాలు కల్పించాలన్నారు. ఈనెల 12 నుంచి 15 వరకు తిరుపతిలో జరగనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా డి.చందు, పి.ఖగేష్, జిల్లా గర్ల్స్ కన్వీనర్‌గా దివ్య, కార్యవర్గ సభ్యులుగా చిన్న దుర్గా ప్రసాద్, జై.రాము ఎన్నికయ్యారు.

బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు

పాత శ్రీకాకుళం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు బోధనలు సమస్త మానవాళి శాంతికి మార్గదర్శకమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. పాస్టర్స్ ఫెలోషిప్, జిల్లా క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలుగు బాప్టిస్ట్ చర్చిలో శుక్రవారం డివిజనల్ పాస్టర్స్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు. పాస్టర్ల కుటుంబ సభ్యులకు దుస్తులను పంపిణీ చేశారు. ఏసు క్రీస్తు ఆలోచన విధానంతో ముందుకు నడవాలని కోరారు. పాస్టర్లు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి

● వైసీపీ హయాంలో పరిపాలనామోదం తెలిపినా ఆర్థిక అనుమతులు లేక ప్రారంభం కాని పనులు
● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



దారుణంగా ఉన్న ఎస్.మత్స్యలేశం రోడ్డు

గార, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మం పంచాయతీ సముద్ర తీర గ్రామమైన మత్స్యలేశం గ్రామానికి వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు అధ్వానంగా ఉంది. గోతుల మయమై, రాళ్లుతేలి కనీసం నడిచేందుకు కూడా వీలులేకుండా తయారైంది. రోడ్డంతా గతుకులుగా ఉండడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి వైసీపీ హయాంలో 2023-24 సంవత్సరంలో ఏఎంసీ నిధులు రూ.70 లక్షలు మంజూరు చేశారు. సుమారు 1.5 కిలోమీటర్లు మేర ఉన్న ఈ రోడ్డు అభివృద్ధి జరుగుతుందని స్థానికులు భావించారు.

ఆర్థిక అనుమతులు లేకపోవడంతో...

ఈ రోడ్డుతో పాటు శ్రీకాకుళం మండలంలో పరదేశీపాలెం రోడ్డు 1.07 కిలోమీటర్లు అభివృద్ధికి రూ.30 లక్షలు, బలివాడ రోడ్డు 1.9 కిలోమీటర్లకు రూ.55 లక్షలు మంజూరు చేశారు. ఈ మూడు రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌కు అప్పగించారు. పరిపాలనాపరమైన ఆమోదం లభించినా ఆర్థిక అనుమతులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ పనులు చేపట్టలేదు. దీంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు రోడ్డు దుస్థితిని పట్టించుకునే నాథుడే కరువయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ రోడ్డును స్థానికుల వినతిమేరకు ఇటీవల ఎమ్మెల్యే గొండు శంకర్ బైక్‌పై వెళ్లి పరిశీలించారు. ఇప్పటికైనా ఈ రోడ్ల నిర్మాణానికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్థిక అనుమతులు రాకపోవడం వల్లే..

ఆర్థిక అనుమతులు రాకపోవడంతో ఈ రోడ్ల అభివృద్ధి ముందుకు సాగలేదు. ఏఎంసీ నిధులు మంజూరై పరిపాలన, సాంకేతిక ఆమోదాలు వచ్చాయి. ఆర్థిక ఆమోదం రాకపోవడంతో రోడ్డు పనులు చేపట్టలేకపోయాం.

-కేసీహెచ్ మహంతి, ఏఈ, పంచాయతీరాజ్

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం

అధ్వానంగా తయారైన ఎస్.మత్స్యలేశం రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఇటీవల పలు దఫాలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరుకు చర్యలు తీసు కుంటామని హామీ ఇచ్చారు.

-కైబాడి రాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు

అరసవల్లి రథసప్తమికి పటిష్ఠ ఏర్పాట్లు

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ● ఏడు రోజుల కార్యక్రమాలపై సమీక్ష

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహించనున్న ఉత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖ అధికారులతో ఏడు రోజుల ఉత్సవాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థం సురక్షిత క్యూలైన్లు ఏర్పాటు చేయాలని, ఏడు రోజుల పాటు ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఆస్థానసేవ, తిరువీధి, స్వామి అలంకరణ, అక్షపుష్పార్చన, సూర్యనమస్కారాలు వంటివి ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తుల భద్రత దృష్ట్యా క్యూలైన్లలో సీసీ కెమెరాలు, స్క్రీన్లు ఏర్పాటు చేయాలని, వలంటీర్లు, పోలీస్‌శాఖ నిరంతర పర్యవేక్షణ తప్పనిసరన్నారు. ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు, దాతలు సమకూర్చే ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించేందుకు పర్యవేక్షించేందుకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు నియమించాలని ఆదేశించారు. సమావేశంలో నమూనా శకటాలు, దేవదాయ శాఖ తరఫున ఏర్పాట్లు, దాతలకు టిక్కెట్ల కేటాయింపు తదితర అంశాలపై చర్చించారు.

ఎగ్జిబిషన్ స్టాళ్లు, ఫుడ్‌కోర్టులు, సైనేజ్ బోర్డులు, ఇన్విటేషన్ పంపిణీ, పార్కింగ్ ప్రాంతాల నిర్వహణకు సంబంధించి అధికారులను నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, డీఆర్వో లక్ష్మణమూర్తి, ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, డీఎస్పీ వివేకానంద, డీఎంహెచ్‌వో డా.అనిత, సుడా ఈఈ సుగుణాకరరావు తదితరులు పాల్గొన్నారు.

రసాయన రహిత పంటల సాగుపై ఆసక్తి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

పాత శ్రీకాకుళం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించడం ద్వారా రసాయన రహిత పంటల సాగుపై రైతుల్లో ఆసక్తి పెరుగుతోందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని 80 ఫీట్ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్లో మెడి కల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో 'సిక్కోలు హరిత మహోత్సవం' శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ, సేంద్రియ వ్యవసాయం, పచ్చదనం పెంపుదలకు దోహదపడే కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. సేంద్రియ వ్యవసాయం దేశ భవిష్యత్‌లో ముడిపడి ఉందన్నారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, మెడికల్ అసోసియేషన్, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి

● జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



రణస్థలం: పైడిభీమవరంలో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రణస్థలం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. పైడిభీమవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీ టింగ్ నిర్వహించగా ఆయన పరిశీలించారు. పిల్లల చదువుపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం వల్లభరావుపేట, సంచాం, కొండములగాంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ కేంద్రాలకే రైతులు ధాన్యం అందజేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు భాగస్వాములు కావాలి

ఆమదాలవలస, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత అన్నారు. శుక్రవారం పట్టణ జూనియర్ కళాశాలలో పేరెంట్స్-టీచర్స్ 3.0 కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత నిస్తోందన్నారు. కార్యక్రమాల్లో నారాయణపురం ఆనకట్ట చైర్మన్ సనపల డిల్లేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు నూకరాజు, సనపల అప్పలనాయుడు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యాం సుందర్, జె.రవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

గార, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి మంచి పేరు తీసుకురావాలని బీజేపీ నాయకుడు, ఏబీటీఎస్ నేషనల్ క్వీనర్ పోకతోట సింహాచలం అన్నారు. వమర వెల్లి బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్- టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు చెప్పే ప్రతి అంశాన్ని గ్రహించి పోటీ ప్రపంచంలో ఎదుర్కొనే శక్తిగా తయారు కావాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.చిట్టితల్లి, ఎస్ఎంసీ చైర్మన్ కిషోర్‌కుమార్, వైస్‌చైర్మన్ వై.రాజేశ్వరి, భవాని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు సింహాచలం

న్యూస్ బాక్స్

ఎల్ఆర్ఎస్.. బీపీఎస్‌పై అవగాహన పెంచాలి

● ఆర్‌డీడీ చామంతి

శ్రీకాకుళం అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగర, పట్టణ ప్రజలకు లేఔట్ రెగ్యులేషన్ (ఎల్ఆర్ఎస్), బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్(బీపీఎస్)లపై అవగాహన పెంపొందించాలని టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ చామంతి ఆదేశించారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం శ్రీకాకుళం అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్ సమక్షంలో మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. ఆర్‌డీడీ పట్టణ ప్రణాళికా విభాగంపై సమీక్ష చేపట్టి అవసరమైన సూచనలిచ్చారు. లక్ష్యాలను చేరుకోవాలని, పురప్రజలకు ప్రధాన పథకలను వివరించాలన్నారు. పట్టణాలను ప్రణాళికాబద్ధంగా ఉంచాలన్నారు. సమావేశంలో ఆమదాల వలస, పలాస, ఇచ్ఛాపురం, రాజాం, పాలకొండ మున్సిపాలిటీల పట్టణ ప్రణా ళికా విభాగం అధికారులు, సుడా పీవో, వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్ సెక్రటరీలు, లైసెన్సు టెక్నికల్ పర్సన్లు, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

1600 ఫస్ట్ ఎయిడ్ కిట్ల పంపిణీ

పాత శ్రీకాకుళం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం కాంప్లెక్స్ ఆవరణలో శుక్రవారం 1600 ఫస్ట్ ఎయిడ్ కిట్లను ఆర్టీసీ అధికారులకు సంజనా దంతవైద్యశాల వైద్యులు సంతోష్, జ్యోత్స్న అందించారు. ఈ సందర్భంగా వారిని జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ అభినందించారు. కార్యక్రమంలో చీఫ్ మెకానికల్ ఇంజనీర్ కె.శ్రీనివాసరావు, సీనియర్ మెడికల్ ఆఫీసర్ కె.కిరణ్ కుమార్, జిల్లా -1 డిపో మేనేజర్ అమర సింహుడు, కండక్టర్లు పాల్గొన్నారు.

జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు శైలజ ఎంపిక



శైలజను అభినందిస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఇచ్ఛాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న గుమ్మడి శైలజ ఎంపికయ్యారు. గత నెల విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-19 స్కూల్ ఫెడరేషన్ పోటీల్లో సత్తాచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శిరీష తెలిపారు. ఢిల్లీలో ఈ పోటీలు ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు జరగనున్నాయన్నారు. ఈ మేరకు శుక్రవారం అలియన్స్ క్లబ్ సభ్యులు బత్తుల వెంకటరమణ సౌజన్యంతో శుక్రవారం సురంగిరాజా మైదానంలో ఆమెను అభినందించి రూ.5 వేలు నగదు, స్విమ్మింగ్ డ్రస్‌ను అందించి అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జి.ఉమాశంకర్, వెంకట్రావు, మాజీ అధ్యక్షులు ఎల్.నరసింహమూర్తి, బి.వెంకటరమణ, క్లబ్ సభ్యులు యోగి, కె.నరసింహమూర్తి, సీహెచ్ వెంకటరమణ, బాల, కామరాజు పాల్గొన్నారు



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

రాష్ట్రస్థాయి పోటీ విజేతలకు అభినందన

ఆమదాలవలస, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో జరిగిన హ్యాండ్‌బాల్ అండర్-19 విభాగంలో తొగరాం హైస్కూల్ విద్యార్థులు జిల్లా జట్టు తరఫున పాల్గొని విజేతలుగా నిలిచారు. ఈ జట్టులో కీలకంగా వ్యవహరించిన పాఠశాలకు చెందిన విద్యార్థులు బంటుపల్లి అనుష్క, అన్నెపు అనూష, మనీషా, తమ్మినేని, దివ్య, కూన కార్తీక్, రామ్‌చరణ్, ఢిల్లీశ్వరరావు, సతీష్, గుణశేఖర్‌లను శుక్రవారం పాఠశాలలో అభినందించారు. హెచ్‌ఎం ఎం.పోలినాయుడు, వ్యాయామోపాధ్యాయుడు జి.రాజశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులను సత్కరించారు. భవిష్యత్తులో మంచి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, వైసీపీ నాయకుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభం

పాత శ్రీకాకుళం, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు శుక్రవారం స్థానిక బాపూజీ కళామందిరంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. 314 నెలలుగా నిరంతరం కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పేద కళాకారులకు పెన్షన్ ఇచ్చేందుకు కృషి చేస్తానన్నారు. రిటైర్డ్ ఆర్డీవో పీఎంజే బాబు మాట్లా డుతూ.. కళాకారుల చేపడుతున్న కార్యక్రమాలను ప్రశంశించారు. ఎల్. సూర్యలింగం-లక్ష్మీనరసమ్మ దంపతులు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సౌజన్యంతో మడ్డపాడు మానవతా నాటక సంస్థ ప్రదర్శించిన 'అందరూ మంచివారే కానీ' నాటిక ఆలోచింపజేసింది. శనివారం అమ్మ చెక్కిన బొమ్మ, ఎవరు నాటికలు ప్రదర్శించనట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గొండు స్వాతి, నిర్వాహకులు చిట్టి నాగభూషణం, ఎల్.రామలింగస్వామి, పన్నాల నరసింహ మూర్తి, రామచంద్రదేవ్ పాల్గొన్నారు.





'అందరూ మంచివారే కానీ' నాటికలో ఓ దృశ్యం, తిలకిస్తున్న పట్టణ వాసులు, కళాకారులు

బోదకాల వ్యాధి రక్తనమూనాల సేకరణ

కంచిలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ ఆదేశాలతో బూరగాంలో బోదకాలు వ్యాధి నివారణకు గాను రక్తనమూనాలు సేకరిస్తున్నట్లు కంచిలి పీహెచ్‌సీ వైద్యుడు తమ్మినేని హరిబాబు తెలిపారు. శుక్రవారం రాత్రి వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. 20 ఏళ్లు పైబడిన 60 మంది నుంచి రక్త నమూనాలు సేక రించామన్నారు. వైద్య పరిభాషలో లింఫాటిక్ ఫిలేరియాసిస్ సంక్రమణకు సంబంధించి కేవలం రాత్రివేళల్లో మాత్రమే రక్త నమూనాలు సేకరిస్తామన్నారు. ఈనెల 12లోగా 300 మంది నుంచి రక్తనమూనాలు సేకరిస్తామన్నారు. బూరగాం, మఠంసరియాపల్లి గ్రామాలను రక్తనమూనాల సేకరణకు ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత బొడ్డు అప్పారావు, వైద్యసిబ్బంది మురళి, రవి, నవ్య, ఆశ, విద్యావతి, పుష్పలత, సత్యవతి, సరోజిని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

జి.సిగడాం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో సమావేశ మందిరంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణారావు తెలిపారు. ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన జరుగు సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమావేశంతో రావాలని ఆయన సూచించారు.

కంచిలిలోనూ..

కంచిలి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తిరుమలరావు తెలిపారు. ఎంపీపీ దేవదాస్‌రెడ్డి అధ్యక్షతన జరుగు సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాలని, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.



ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి,
ప్రాంతీయ కార్యాలయం, శ్రీకాకుళం-532005.
ఫ్లాట్ నెం. 32, డోర్ నెం. 16-13-25, 2వ క్రాస్ రోడ్, పురుషోత్తంనగర్ కాలనీ, గుజరాతీపేట గ్రామం, శ్రీకాకుళం.

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

భారత ప్రభుత్వ పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ పర్యావరణ చట్టం 1986 క్రింద విడుదల చేసిన ఎస్.ఒ.నెం.1533, తే.14-09-2006ది మరియు తదుపరి సర్క్యులర్ ప్రకారం సర్వే నెం.01, అద్దుకొండ గ్రామం, టెక్కలి మండలం, శ్రీకాకుళం జిల్లా యందు 2.0 హెక్టార్ల విస్తీర్ణంలో కలర్ గ్రానైట్ ఉత్పత్తి పెంచుటకు మరియు గ్రానైట్ వేస్ట్‌ను రోడ్ మెటల్ వెలికితీయుటకు సంబంధించి పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించుట గురించి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, శ్రీకాకుళం జిల్లా వారు జారీ చేయు ప్రకటన.

ప్రాజెక్ట్ వివరములు క్రింది విధంగా ఉన్నవి:

1	సంస్థ పేరు మరియు చిరునామా	M/s అర్చన గ్రానైట్స్, ఎస్ వి ఆర్ కాంప్లెక్స, ముంగమూరు రోడ్, ఒంగోలు, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 523002, ఫోన్ నెం.9885451666 Email.Id: archanagranitesmines@gmail.com
2	ప్రాజెక్ట్ స్థలం	సర్వే నెం.1, అద్దుకొండ గ్రామం, టెక్కలి మండలం, శ్రీకాకుళం జిల్లా
3	అధీకృత వ్యక్తి పేరు, మరియు చిరునామా	శ్రీ సిద్ధ వెంకటేశ్వరరావు, ఎస్ వి ఆర్ కాంప్లెక్స్, ముంగమూరు రోడ్, ఒంగోలు, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 532002, ఫోన్ నెం: 9885451666
4.	ప్రాజెక్ట్ విలువ	రూ.55.0 లక్షలు
5.	ఉత్పత్తి వివరములు	కలర్ గ్రానైట్ సాలినా-3966 ఘ.మీ నుండి 9455 ఘ.మీ సామర్థ్యం పెంచుటకు మరియు రోడ్ మెటల్ - 7820 ఘ.మీ. 2.0 హెక్టార్ల విస్తీర్ణంలో
6.	తేదీ, సమయం మరియు జరుగు స్థలం	తేది: 06-01-2026(మంగళవారం), సమయం: 12.30గం.లకు (మధ్యాహ్నం) వేదిక: ప్రతిపాదిత ప్రాజెక్ట్ వద్ద, అద్దుకొండ గ్రామం, టెక్కలి మండలం, శ్రీకాకుళం జిల్లా.

7. ప్రాజెక్ట్ కార్యనిర్వాహక సమాచారం, ప్రాజెక్ట్ పర్యావరణ ప్రభావ అంచనా మరియు కార్యాచరణ ప్రణాళిక నివేదిక మరియు సాఫ్ట్ కాపీలు ప్రజలు చూచుటకు అందుబాటులో ఉంచబడిన ప్రదేశములు: (1) జిల్లా కలెక్టరు వారి కార్యాలయం, శ్రీకాకుళం. (2) జిల్లా పరిశ్రమల శాఖ, శ్రీకాకుళం. (3) ముఖ్య కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయం, జిల్లా పరిషత్, శ్రీకాకుళం. (4) సభ్య కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ భవన్, APIIC కాలనీరోడ్డు, గురునానక్ కాలనీ, ఆటోనగర్, విజయవాడ, (5) జోనల్ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, విశాఖపట్నం. (6) డిప్యూటీ డైరెక్టర్ (ఎస్), కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, సమీకృత ప్రాంతీయ కార్యాలయం, గ్రీన్‌హౌస్, గోపాలరెడ్డి రోడ్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520010, (7) రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం, టెక్కలి డివిజన్, శ్రీకాకుళం. (8) జిల్లా గనులు మరియు భూగర్భ శాఖ అధికారి వారి కార్యాలయం, శ్రీకాకుళం. (9) డివిజనల్ గనులు మరియు భూగర్భ శాఖ అధికారి వారి కార్యాలయం, టెక్కలి, శ్రీకాకుళం జిల్లా. (10) ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, శ్రీకాకుళం. (11) తహశీల్దార్ వారి కార్యాలయం, టెక్కలి మండలం, శ్రీకాకుళం జిల్లా. (12) మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయం, టెక్కలి మండలం, శ్రీకాకుళం జిల్లా. (13) గ్రామ పంచాయితీ కార్యాలయం, మేఘవరం గ్రామం, బోరిగిపేట గ్రామం, ఆంజనేయపురం గ్రామం మరియు వీరరామకృష్ణాపురం గ్రామం టెక్కలి, శ్రీకాకుళం జిల్లా.

పై తెలిపిన ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఏమైనా సూచనలు, సలహాలు, అభిప్రాయాలు మరియు అభ్యంతరములు ఉన్న యెడల 30 రోజుల లోపు ఈ క్రింది సంతకము చేసిన అధికారికి లిఖితపూర్వకముగా పంపించవచ్చును. మరియు పైన సూచించిన తేదీ మరియు ప్రదేశము వద్ద కోవిడ్-19 నియమావళిని అనుసరించి సదస్సులో పాల్గొని తమ సలహాలు, సూచనలు తెలియజేయవచ్చును.

స్థలం: శ్రీకాకుళం.
తేది: 05.12.2025

సం/- **పర్యావరణ ఇంజనీర్,**
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి,
ప్రాంతీయ కార్యాలయం, శ్రీకాకుళం.

ఉపాధ్యాయుల మార్గదర్శనలో నడవాలి

● ట్రైనీ కలెక్టర్ వెంకటేష్



నరసన్నపేట: మాట్లాడుతున్న ట్రైనీ ఐఏఎస్ వెంకటేష్

నరసన్నపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల మార్గదర్శనలో విద్యార్థుల నడవాలని జిల్లాకు చెందిన ట్రైనీ ఐఏ ఎస్ బాన్న వెంకటేష్ అన్నారు. శుక్రవారం ట్రైనీ కలెక్టర్ తాతయ్య గ్రామమైన బసివలస పాఠశాలలో నిర్వహించిన పీటీఎం-3లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఉపాధ్యాయులు చెప్పింది వినాలని, విద్యార్థులకు ప్రాథమిక దశే కీలకమన్నారు. భాష ప్రాధాన్యం కాదని.. భావం ముఖ్యమన్నారు. ఉపాధ్యాయులు, గ్రామస్థులు వెంకటేష్ సన్మానించారు.

విద్యార్థుల ఉన్నతి కోసమే పీటీఎం



కోటబొమ్మాళి: మాట్లాడుతున్న గోవిందరాజులు

కోటబొమ్మాళి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉన్నతి కోసమే మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ (పీటీఎం) అని రాష్ట్ర కళింగ వైశ్య వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు అన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీ బాలికల పాఠశాల, స్థానిక జూనియర్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన పీటీఎం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బోయిన రమేష్, పట్టణ అధ్యక్షుడు కోరాడ గోవిందరావు, మాజీ సర్పంచ్ దేవాది సింహాద్రమ్మ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: సమావేశంలో పాల్గొన్న తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ మోహనరావు

పండగ వాతావరణంలో..

కొత్తూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వివిధ స్కూల్స్‌లో పీటీఎం సమావేశం పండగ వాతావరణంలో జరిగింది. కొత్తూరు నిర్వహించిన కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ పి.మోహనరావు, ఎంపీపీ సవర సావిత్రి, ఎంపీడీవో రాంప్రసాదరావు, వైస్ ఎంపీపీ ఎల్.తులసీ వరప్రసాదరావు, ఎంఈవో శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు అగతముడి మాధవరావు, ఏ అరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే విద్యా వ్యవస్థ మెరుగు

మెళియాపుట్టి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే విద్యావ్యవస్థ మెరుగుపడిందని కొసమాల పీఏసీఎస్ చైర్మన్ సలాన మోహనరావు అన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన పీటీఎం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తహసీల్దార్ బి.పాపరావు, ఎంపీడీవో ప్రసాద్ పండా, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మెళియాపుట్టి: మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

హరిపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పాఠశాలల జిల్లా సమన్వయాధికారి వై.యశోదలక్ష్మి అన్నారు. మందస మండలం రాధాక్రిష్ణపురంలోని ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా పీటీఎం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మండలంలో అన్ని పాఠశాలల్లో పీటీఎం సమావేశాలు నిర్వహించారు.

● నందిగాం: మండలంలో పీటీఎం-3 కార్యక్రమం శుక్రవారం పండగ వాతావరణంలో జరిగింది. నందిగాం బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా సమన్వయాధికారి వై.యశోదలక్ష్మి పాల్గొని మాట్లాడారు. ఎంపీడీవో యు.కుమార్ పట్నాయక్, ప్రిన్సిపాల్ బి.మంజుల, ఎంఈవో చిన్నారావు, వైద్యాధికారిణి భరణి, సర్పంచ్ జడ్యాడ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



నందిగాం: మాట్లాడుతున్న జిల్లా సమన్వయాధికారి యశోదలక్ష్మి

గంజాయితో ఇద్దరి అరెస్టు

నరసన్నపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గంజాయితో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక మడపాం టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. బరంపురం నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న లారీలో ఇద్దరు వ్యక్తులు బ్యాగ్‌లో ఎనిమిది కిలోల గంజాయితో పట్టుబడ్డారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన శుభమ్ గౌడ, దీపక్ మాత్రిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

శబరిమలలో జిల్లావాసి మృతి



వరహానరసింహులు(ఫైల్)

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాగోలు పంచాయతీ కూటికుప్పలవానిపేటకు చెందిన గురుస్వామి గురుగుబెల్లి వరహానరసింహులు(72) కేరళ రాష్ట్రం శబరిమలలో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్టు తోటి స్వాములు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నలుగురు అయ్యప్ప స్వామి మాల ధరించగా వారితో పాటు మరో ముగ్గురు కలిసి ఈనెల 3న శబరిమల వెళ్లారు. శుక్రవారం వేకువ జామున శబరిమల కొండకు చేరుకున్న తరువాత వరహానరసింహులకు గుండెపోటు రావడంతో ఒక్కసారి కుప్పకూలిపోయాడు. వెంటనే ఇతర స్వాములు సమీపంలో ఆసుపత్రికి అంబులెన్సులో తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈయన 1993 నుంచి మాలాధారణ వేస్తూ గురుస్వామిగా పరిసర ప్రాంతాల్లో పేరొందారు. వరాహనరసింహులు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పట్టణంలో దొంగల హల్‌చల్

● తాళాలు వేసి ఉన్న రెండిళ్లలో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

పొందూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పొందూరులో గురువారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. తాళాలు వేసి ఉన్న రెండిళ్లలో చోరీకి పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. పొందూరు పట్టణం గాంధీనగర్‌లో మాడుగుల లక్ష్మి ఇంటిలో చోరీ జరిగింది. తులం బంగారు చైన్, రూ.లక్ష నగదు, వెండి వస్తువులు దొంగిలించారు. గాంధీనగర్ రెండోవీధిలో ఎచ్చెర్ల పైడిరాజు ఇంటిలో దొంగలు పడి అరతులం బంగారు వస్తువులు, వెండి వస్తువులు దొంగలించారు. శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తించి ఇచ్చిన సమాచారంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాలను క్లూస్‌టీం సందర్శించి వివరాలు సేకరించింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

ప్రయాణికులుగా ఆటో ఎక్కి..

● బ్యాగును కోసి రూ.3 లక్షలు చోరీ

● పోలీసులకు ఫిర్యాదు చేసిన వృద్ధుడు

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తున్న ఓ వృద్ధుడి బ్యాగ్‌లో ఉన్న రూ.3 లక్షలు నగదు చోరీ జరిగిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. శ్రీకాకుళం టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బొందిలీపురం శివరాంనగర్ కాలనీకి చెందిన వృద్ధుడు సక్కరి సత్యాగోపి సింహద్వారం వద్ద ఉన్న ఎస్‌బీఐ లాకర్‌లో గతేడాది రూ.4 లక్షలు దాచుకున్నాడు. అవసరాల నిమిత్తం శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో లాకర్ నుంచి తీసిన నగదు సింహద్వారం వద్ద ఆటో ఎక్కి బొందిలీపురం తన ఇంటికి బయలుదేరాడు. అదే మార్గంలో ఉన్న వెంకటాపురం జంక్షన్ వద్ద ముగ్గురు యువకులు ఆటో ఎక్కి కొంతదూరం ప్రయాణించి కేటీఎం ద్విచక్ర వాహనాల షోరూం వద్ద దిగిపోయారు. అయితే వృద్ధుడు సక్కరి సత్యాగోపి కొంత దూరం వెళ్లి చూసేసరికి బ్యాగ్ కట్ చేసి ఉండడాన్ని గమనించి అందులోని రూ.3 లక్షలు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. వెంటనే టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీఐ ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వరి కుప్పల దగ్ధం



అగ్నికి ఆహుతైన వరి కుప్పలు

బూర్జ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కొండపేట గ్రామంలో శుక్రవారం రాత్రి వరి కుప్పలు దగ్ధమయ్యాయి. పాలక శ్రీరాములుకు చెందిన రెండు ఎకరాలు, మజ్జి సూర్యనారాయణకు చెందిన రెండు ఎకరాల వరికుప్పలు ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షలు ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా వేస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టి ఉంటారని రైతులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పాలకొండ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

కొసమాల మాజీ సర్పంచ్ మృతి



లోకనాథం(ఫైల్)

మెళియాపుట్టి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కొసమాల మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు అంకడాల లోకనాథం శుక్రవారం ఉదయం మృతి చెందారు. కొన్నాళ్లుగా ఆయన అనారోగ్యానికి గురైనట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. లోకనాథం మృతిపై ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ సంతాపం తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

కొత్తూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. తనిఖీల్లో పట్టుబడితే రూ.10వేలు వరకు జరిమానా, జైలుశిక్ష పడే అవకాశం ఉందన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల బారిన పడడమే కాకుండా ఇతరుల ప్రాణాలను హరించే ప్రమాదం ఉందని వీటిని గుర్తించి వాహనదారులు మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు.

ఎక్కువ కేసులు రాజీ చేయించండి



మాట్లాడుతున్న న్యాయాధికారి వాణి

నరసన్నపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఈనెల 13న జరగనున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా కక్షిదారులకు అగాహన కల్పించాలని స్థానిక సివిల్ కోర్టు జూనియర్ న్యాయాధికారి ఎస్.వాణి సూచించారు. శుక్రవారం పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులు ఇరువర్గాలను పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. రాజీ మార్గం ప్రాధాన్యతను తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరావు, పోలాకి ఎస్ఐ రంజిత్, ఏఎస్ఐ తులసీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా

● ఎమ్మెల్యే గౌతు శిరీష



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కళాశాల భవనాల సమస్యను అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు ఎమ్మెల్యేకు వివరించారు. సొంతభవనం లేకపోవడంతో స్థానిక హైస్కూల్ అదనపు గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నట్టు వివరించారు. నూతన భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయన ఎమ్మెల్యేను కోరారు. కళాశాల ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్ పట్నాయక్, నాయకులు కర్ని రమణ, గొరకల విఘ్నేష్, మాజీ ఎంపీపీ జి.వసంతరావు, మాజీ సర్పంచ్ గోవింద పాపారావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మూలపేట పోర్టు పరిశీలన



పోర్టు ప్రాంతంలో పర్యటిస్తున్న గ్రూప్ సభ్యులు

సంతబొమ్మాళి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మూలపేట పోర్టును రాష్ట్ర మానిటింగ్ గ్రూప్ బృందం శుక్రవారం పరిశీలించారు. మానిటింగ్ గ్రూప్ (ఎస్‌పీఎంటీ) సభ్యులు భార్గవ్ కందుల, జితిన్ బృందం సభ్యులు పోర్టును సందర్శించి పనులు ప్రగతిని పరిశలించారు. ఇటీవల మూలపేట పోర్టు నిర్మాణ గడువును రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విషయం విదితమే.

ప్రభుత్వ కళాశాల తరలిస్తే ఉద్యమిస్తాం



డీటీకి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

హరిపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మందస పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సుదూరంలోని చీపి రోడ్డుకు తరలించాలని ప్రయత్నిస్తే పెద్దఎత్తున ఉద్యమిస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మజ్జి బాబూరావు, పలువురు ప్రజా సంఘ నాయకులు హెచ్చరించారు. ఈ సందర్భంగా శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ కె.రామ కృష్ణకు, ఎస్ఐ కె.కృష్ణప్రసాద్‌కు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని పేద విద్యార్థుల కోసం దివంగత పీసీసీ చైర్మన్ మజ్జి తులసీదాస్ కృషి మేరకు కళాశాలను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో సింహాచలం మల్లికో, గణేష్, ఉప్పాడ రాజారావు, రాజాన తులసీప్రసాద్, కొర్ల హేమరావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపాల ప్రదర్శన



దీపాలతో తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు

పోలాకి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): దీర్ఘాశి పురవీధుల్లో శుక్రవారం రాత్రి దీర్ఘాశి దుర్గాకాలనీ దుర్గాగిరి ఆలయ సన్నిధిలో ఉన్న భవానీ మాలాధారణ భక్తులంతా చేతుల్లో దీపాలు పట్టుకుని ప్రదర్శించారు. గురుభవానీలు పల్లి రాజు, చిరంజీవి ఆధ్వర్యంలో నిర్వహించారు.

● మందస: మందసలో అంగరంగ వైభవంగా కలశయాత్రను శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. గోపాలసాగరం నుంచి యజ్ఞ స్థలం వరకూ మహిళలు కలశాలతో ఊరేగింపుగా చేరుకొని దీపాలం కరణ చేపట్టారు. 251 కలశాలతో మహిళలు ఊరేగింపుగా ప్రధాన స్థలం వద్దకు చేరుకొని 1008 దీపాలతో పూజలు చేశారు.



● పలాసరూరల్: పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో ఈ ఏడాది ఆగస్టు 17న ప్రారంభమైన సత్యసాయి అఖండ జ్యోతి శుక్రవారం ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి మీదుగా పలాస మండలం రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్‌కు చేరుకుంది. ఇక్కడ మూడురోజులపాటు భక్తుల దర్శనానికి ఉంచనున్నారు. అనంతరం ఇతర ప్రాంతాల గుండా చేరుకొని వచ్చే ఏడాది ఏప్రిల్ 24 నాటికి పుట్టపర్తి చేరుకుంటుందని ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు తెలిపారు.

ఈవ్‌టీజింగ్‌కు గురవుతున్న బాలికలు

● మంత్రికి ఫిర్యాదుచేసిన ఉపాధ్యాయులు



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ బాలికల హైస్కూల్ ప్లస్‌కు చెందిన విద్యార్థులు తరచూ ఈవ్‌టీజింగ్‌కు గురవుతున్నారని ఉపాధ్యాయులు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు సుమారు 860 మందికి పైగా విద్యార్థులు ఉన్నారని, వారు ప్రతిరోజు స్కూల్‌కు వచ్చి, వెళ్లే సమయాల్లో బాలికలు ఈవ్‌టీజింగ్‌కు గురవుతున్నారని ఆ పాఠశాల ఉపాధ్యాయులు మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి వెంటనే టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్‌న పిలిచి ఈ పరిసరాల్లో ఏమి జరుగుతుందో గుర్తించాలని, మఫ్టీలో విధులు నిర్వహించేలా చూడాలని ఆదేశించారు.

పథకాలు అందడం లేదు..

మండా పోలం కాలనీకి చెందిన నౌగాపు అమ్మోజీ అన్నదాత సుఖీభవ డబ్బులు జమకాలేదని, అలాగే కొర్లాపు మోహనరావు తమ పిల్లలు ఇదే హైస్కూల్‌లో చదువుతున్నా తల్లికి వందనం రావడం లేదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ దృష్టికి తీసుకువెళ్లారు. తమకు ఇళ్లు గడవడమే కష్టంగా ఉందని, తమకు ప్రభుత్వ పథకాలు ఇచ్చి ఆదుకోవాలని జడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ వద్ద కలెక్టర్‌ను శుక్రవారం వేడుకున్నారు. ఆర్డీవో ఎం.క్రిష్ణమూర్తికి వీటిని పరిశీలించాలని సూచించారు.

హైస్కూల్ మైదానం పరిశీలన

స్థానిక జిల్లాపరిషత్ బాలికల హైస్కూల్ ప్లస్‌కు అవసరమైన మైదానం కోసం శుక్రవారం మధ్యాహ్నం ప్రభుత్వ ఉన్నతపాఠశాలకు చెందిన శిథిలావస్థలో ఉన్న తరగతి గదులు, ఖాళీ ప్రాంతాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆర్డీవో తదితరులు సందర్శించారు. ఈ ప్రాంతంలో 380 మీటర్ల విస్తీర్ణం ఉందని, జంగిల్ క్లియరెన్స్‌తోపాటు శిథిల భవనాలు తొలగించడానికి, క్రీడా వసతులు నిర్మాణానికి సుమారు రూ.33లక్షలు అవసరమవుతుందన్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, పీఆర్ డీఈఈ సుధాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రామకృష్ణ, ఆర్అండ్‌బీ డీఈఈ రవికాంత్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు తొలగింపు



కట్టడాలను కూల్చివేసిన దృశ్యం

మందస, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమాగిరి గ్రామ సమీపాన అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. అర్అండ్‌బీ రోడ్డు-సునాముది సిస్టమ్ దేశిబట్టి చానల్ మీద అక్రమ కట్టడాలు నిర్మించినందున అధికారులకు పలువురు పిర్యాదులు అందజేశారు. శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ కె.రామకృష్ణ, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎస్ఐ క్రిష్ణారావు పర్యవేక్షణలో జేసీబీ సాయంతో కూల్చివేశారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికితీయాలి

పాతపట్నం డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలని పీఏసీఎస్ చైర్మన్ బండి రవివర్మ తెలిపారు. సీది జడ్పీ హైస్కూల్‌లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటువంటి పోటీతత్వ భావాలు విద్యార్థుల్లో పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆంగ్లో ఉపాధ్యక్షుడు కొల్లి లక్ష్మనారాయణతోపాటు ఉపాధ్యాయులను అభిందనించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.ప్రసాదరావు, ఎంపీడీవో హెచ్‌వీ రమణమూర్తి ఎంఈవో సీహెచ్ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

నరసన్నపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎరువులు షాపులను శ్రీకాకుళం ఏడీఏ బగ్గు రజని శుక్రవారం పరిశీలించారు. రబీకాలంలో ఎరువులను బ్లాక్ చేసే దుకాణదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. కాలం చెల్లిన పురుగుమందుల విక్రయాలు చేయరాదని సూచించారు. అధిక ధరలకు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. స్టాక్‌బోర్డులో ఎరువుల లభ్యత, ధరల వివరాలు రాయాలన్నారు. ఏవో సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే



ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే గోవిందరావు

కొత్తూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి నారా చంద్రబాబు, నారా లోకేష్‌ను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవింద రావు కలిశారు. శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా భామినిలో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో పాల్గొని చంద్రబాబును ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిసి సాదారంగా ఆహ్వానించారు. అలాగే టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట రమణమూర్తి ముఖ్యమంత్రి చంద్రబాబును కలుసుకున్నారు.

ఓడీ సౌకర్యం కల్పించాలి

పలాస, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏపీ టీచర్స్ ఎలిజిబులిటీ (టెట్) పరీక్షలకు హాజరయ్యే ఉపాధ్యాయులకు ఓడీ సౌకర్యం కల్పించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మజ్జి చిన్నబాబు, జిల్లా సహాధ్యక్షుడు నెమలిపురి విష్ణుమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డిసెంబరు 10వ తేదీ నుంచి 21వ తేదీ వరకూ రెండు సెషన్స్‌లో పరీక్షలు నిర్వహిస్తున్నారని, ఇప్పటికే డిసెంబరు నెల పూర్తి కావస్తున్న పరిస్థితుల్లో టెట్‌కు అప్లై చేసిన ఉపాధ్యాయులందరికీ క్యాజువల్ లీవ్స్, స్పెషల్ క్యాజువల్‌లీవ్స్ పూర్తవడం వల్ల పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశం లేదన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని టెట్‌కు హాజరయ్యే ఉపాధ్యాయులకు ఓడీ సౌకర్యం కల్పించేలా ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పలాస రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సీఆర్ఎం టీచర్లు/క్లస్టర్ రీసెర్చ్ మొబైల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ నాయకులు ఉర్నాన అప్పలరాజు, పోలారి శేషగిరి, దుర్యోదన కోరారు. ఈ మేరకు ఎంఆర్‌సీ కేంద్రం వద్ద శుక్రవారం సమస్యలతో కూడిన వినతిపత్రంను ఎంఈవో సీహెచ్ శ్రీనివాసరావుకు అందజేసి మాట్లాడారు. సీఆర్ఎంటీలను రెగ్యులరైజ్ చేయాలని, పీఎఫ్, గ్రాట్యూటీ ఇవ్వాలని, రిటైర్డు వయసు 62కు పెంచాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో సీఆర్ఎంటీలు సవర కేశవరావు, ఎర్నియ భాస్కరరావు, ఉష, శంకరరావు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సాయం

సంతబొమ్మాళి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగం పొందిన తంగి గోవిందరావు తాను చదువుకున్న లక్ష్మీపురం పాఠశాలకు రూ.25వేలు నగదును అందజేశారు శుక్రవారం పాఠశాల్లో జరిగిన మెగా పేరెంట్స్ మీటింగ్‌లో ఆయన తన తండ్రి శంకరయ్య పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ గోవిందరావుకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తంగి వెంకటరమణ, సూరిబాబు, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

బోరు మరమ్మతులు

నందిగాం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నందిగాం బీసీ బాలుర వసతిగృహంలో పాడైన తాగునీటి బోరును ఎంపీడీవో యు.కుమార్‌పట్నాయక్ చొరవతో మరమ్మతులు చేయించారు. ఈ మేరకు శుక్రవారం మెకానిక్‌లతో ఎన్నోరోజులుగా దెబ్బతిన్న బోరును మెకానిక్‌లు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవోకు వసతిగృహ సంక్షేమ అధికారిణి, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

మండలాభివృద్ధికి నిధులు

మందస, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలాభివృద్ధికి పల్లెపండుగ-02లో భాగంగా రూ.6కోట్లు మంజూరైనట్లు జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీరు ఈరన్నాయుడు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. గ్రామసభల ద్వారా తీర్మానం చేసి ప్రతీ పనిని పల్లెపండగ ద్వారా జరిగేలా చూడాలన్నారు. డీఈఈ జి.రవిబాబు, ఏఈ హిమాని పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

నందిగాం, డిసెంబం 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నియోజకవర్గస్థాయి గ్రిగ్స్ పోటీల్లో ప్రతిభ కనబరచడంతో ప్రధానోపాధ్యాయులు టి.గవిరేసు ఆధ్వర్యంలో అభినందనల కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాంపురం సర్పంచ్ పినకాన జోగారావు పాల్గొని విజేతలకు బహుతులు అందజేశారు.